

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 జూన్, 2022 సంచిక : 1

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

చిరునామా :-
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
వాలే వయసులోనూ వీడని ........ 4
ఎవరికి ఉపదేశం చెయ్యాలి ........ 9
రామకోటి వ్రాయటం వలన ........ 11
THE TEACHER ........ 14
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 15
శాశ్వత ధర్మగోప్త ........ 18
సాయిభక్త దాసగణు ........ 21
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 25
బాబాతో మా అనుభవాలు ........ 27
మాతృసంస్థ కబుర్లు ........ 30


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







## మా వాణి



మాన్య పాఠక మిత్రులందరికీ సాదరప్రణామాలు.

గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః ॥

ఉదయం ప్రార్థన జరుగుతోంది సాయిధామంలో.

నారాయణ సమారంభం అంటూ పిల్లలు తరువాతి శ్లోకానికి వెళ్ళిపోయారుగానీ, ఆ తొలి శ్లోకం నాకు గురుపూర్ణిమను గుర్తుచేసింది. జూలై 13వ తేదీన రానున్న గురుపూర్ణిమనే వ్యాసపూర్ణిమ అంటారు. ఆలోచనలలో కొట్టుకుపోతోంది మనసు. అవునూ-మనస్సూ, ఆలోచనా వేరువేరు కావుగా!

'మాతాజీ, మాతాజీ!' చిన్న పిల్లలు హడావిడిగా వచ్చారు.

"మాతాజీ, గురవే బ్రహ్మా, గురువే విష్ణువు, గురువే శివుడూ కూడా అయితే మరి మనం వేరే బ్రహ్మా, విష్ణు, మహేశ్వరులను పూజించనక్కర లేదు కదా!'

అన్నది పిల్లల ప్రశ్న. దానికి జవాబుగా మాతాజీ ఇలా సెలవిచ్చారు-

గురు పరంపరకు ఆదిపురుషుడు దత్తాత్రేయమూర్తి అని పెద్దలు చెప్తారు. దత్తాత్రేయ మూర్తి ముగ్గురు మూర్తుల సమాహార స్వరూపం. ఆయనే స్వయం పరబ్రహ్మ స్వరూపం. కనుక ఇలా ఆయనే అన్నీ అని చెప్పారు. గురువులందరూ పరమాత్మకు ప్రతీకలే. ఇది ఒక భావన.

మరొకటి-మనకూ, గురువుకూ ఉన్న అనుబంధం దేని ద్వారా? జ్ఞానం ద్వారా కదా! మన లోపల జ్ఞానాన్ని సృష్టించే బ్రహ్మ (సృష్టికర్త) గురువే. తరువాత మన వినయ విధేయతలను, విశ్వాసాన్ని గమనించి కరుణతో ఆ జ్ఞానాన్ని క్షణక్షణం వృద్ధి చేస్తూ పోషించే విష్ణువూ గురువే. మనలో

అహంకారం తలెత్తిందీ సత్యాన్ని కాస్తా అహంకారంతోనో, మమకారంతోనో, కామక్రోధలోభాది అరిషడ్వర్గపు తాకిడితోనో లయింపజేసే రుద్రుడు కూడా గురువే. గురువంటే ప్రేమ స్వరూపుడు కదా-అలా శిష్యులపై పగబట్టి వాళ్లను నాశనం చేస్తాడా? అని ఓ ప్రశ్న. అసలు గురువుకు కోపం రావటం గానీ, ప్రళయతాండవం చేసేంత స్థితిగానీ ఎందుకు కలుగుతుంది? శిష్యుడు చిరంతనమైన ప్రేమతో గురువును అంటిపెట్టుకొని ఉన్నంతకాలం ఆయన మనసులో ఏ విధమైన అంతరంగానీ, ద్వైధీభావనగానీ తలెత్తవు. శిష్యునిలో అహం పొడసూపిందీ అంటే గురువుకు కాస్త దూరంగా జరిగాడు. ఆ దూరం అవతలి వారిలో కూడా దూరాన్ని పెంచుతుంది గదా! గురువుకు దూరమైన శిష్యుడిలో ఆత్మవిచారణ తగ్గుతుంది. ఆత్మ విచారణ తగ్గటంతో తనలో వికసించి ఎదుగుతున్న జ్ఞానలతను తానే శుష్కింపజేసుకున్న వాడవుతాడు. అసలు శిష్యుడు కూడా స్వయంగా జ్ఞానమూర్తే కానీ తన లోపలి తేజస్సును కనువిప్పి చూడగల శక్తి (మాయలోబడి) కోల్పోయి, అజ్ఞుడైపోగా-గురువు మళ్లీ ఆ దృష్టిని ప్రసాదిస్తాడు అని గురుబ్రహ్మ అనటంలోని ఆంతర్యం.

మనిషిలో గురువు పట్ల ఉండే వినయమే అతనికి గురుశక్తిని గ్రహించ గల శక్తినిస్తుంది. గురువు నుండి అనంతశక్తిని గ్రహించగల బలం మనిషికి వస్తుంది. తాను సాధించిన ఆ శక్తిని లోకకళ్యాణ నిమిత్తమై అతడు ఉపయోగించాలి. ఎప్పుడైతే వ్యక్తి-శిష్యుడు, ఆ శక్తిని స్వార్థం కోసం స్వయంగా కీర్తినో, ధనాన్నో సంపాదించుకోవటం కోసం మాత్రమే ఉపయోగించుకుంటాడో, అప్పుడా శిష్యుడిలోని జ్ఞానం శవప్రాయమే అవుతుంది. అందుకే పెద్దలన్నారు-శిష్యుడిలో వినయం నిండి ఉంటే అతని జ్ఞానం 'శివం' అంటే శుభం అవుతుంది. అలాకాక తల ఎగరేశాడు. అతని జ్ఞానం 'శవం' అవుతుంది అని. 'తలఎత్తితే శవం-తల వంచితే శివం' అన్న నానుడి అలా ఏర్పడిందే.

"ఎల్లవేళలా తలవంచే ఉండాలా గురువుకు?" అని ఒకరికి సందేహం





వచ్చింది. అవునన్నారు ప్రక్కవారు. 'ఎందుకుండాలయ్యా? ఆయనకున్న తెలివితేటలు మనకూ ఉన్నాయిగా! ఆయనకేమన్నా కొమ్ములున్నాయా? అన్నారు సందేహపడినవారు. వెంటనే ఆ రెండో వారన్నారు గదా- 'అవు నయ్యా లేకేం? 'గ'కు కొమ్మిస్తే గు, 'ర'కు కొమ్మిస్తే రు, 'వ'కు కొమ్మిస్తే వు- 'గురువు' అవుతుంది. పరమశివుని దగ్గర నిరంతరం నివసించే నందికైనా రెండు కొమ్ములేగానీ గురువుకు మాత్రం మూడు కొమ్ములు. వాటితోనే నీలోని దారేషణ, పుత్రేషణ, ధనేషణలను పొడవగలడు. ఆ కొమ్ములతోనే నీ లోపలి సత్వ, రజ, స్తమో గుణాలను చితక్కొట్టగలడు. ఆ కొమ్ములతోనే నేను, నీవు, వాడు అనే భేదభావాలను పొడిచిపారేసి, సర్వాత్మలలోనూ ఏకాత్మనే చూడగల శక్తిని ప్రసాదిస్తాడు. అంచేత ఎల్లవేళలా గురువుకి లొంగి ఉండవలసిందే-పో అన్నాడు.

అయ్యా! అదీ సంగతి.

## వాలే వయసులోనూ వీడని వాంఛలు!

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. కౌరవులు నూరుగురూ కన్ను మూశారు. రణరంగ విశేషాలను క్షణక్షణం శాబ్దిక ప్రత్యక్ష ప్రసారం ద్వారా తెలుసుకున్న ధృతరాష్ట్రుడు తుదిఫలితం విని కుమిలిపోయాడు. చివరకు పుట్టెడు పుత్రశోకంతో ధర్మరాజు పంచన చేరారు ధృతరాష్ట్ర దంపతులు. అంత వార్ధక్యం, విషాదంలోనూ రాజమందిరాల్లోని హంసతూలికా తల్పాలపై సేద తీరుతున్నారు. అప్పుడు ఆ రాజగృహంలోకి ప్రవేశించాడు విదురుడు. పాండవుల నీడలో రాజభోగాలు అనుభవిస్తున్న పెద్దన్నను చూసి, విదురుడు విస్తుపోయాడు. ఆ వయస్సుకు కావలసిన వైరాగ్యాన్ని విపరీత వ్యాఖ్యలతో గుర్తు చేశాడు. 'అన్నా! ఇంకా నీకు ఈ శరీర సుఖాలపై విరక్తి కలగలేదా? ఈ వయస్సులో, ఇంత విషాదంలో కూడా నీవు ఏమి అనుభవిద్దామని ఈ మహాసౌధాల్లో తిష్ఠ వేసి కూర్చున్నావు? ఇంకా ఈ భోగభాగ్యాలపై

అసహ్యం కలగడం లేదా? ఈ జీవితంపై సిగ్గువేయడం లేదా?' అని కటువుగా ప్రశ్నిస్తాడు. అప్పుడు ఆ వృద్ధదంపతులకు కనువిప్పు కలుగుతుంది. అనంతరం అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా విదురుడితో కలసి గాంధారి, ధృతరాష్ట్రులు భగవచ్చింతనకై అడవులకు వెళ్లిపోయి అక్కడే తుదిశ్వాస విడుస్తారు.

ఈనాటికీ కళ్ళుండీ ధృతరాష్ట్రుడిలా వెర్రివాంఛలతో, వ్యామోహాలతో ఈ శరీరమే శాశ్వతమనుకునేవారు మనలో చాలామందే ఉన్నారు. తల ముగ్గుబుట్టలా మారినా, తనువు ఎండుకట్టెలా వంగినా ఇంకా శరీరంతో ఏదో అనుభవిద్దామని తహతహలాడుతున్నారు. వార్ధక్యంలోనూ యౌవనాన్ని ఊహించుకొని, కోరికల కాసారాల్లా మారిపోతున్న ఇలాంటి వారిని ఉద్దేశిస్తూ, ఆదిశంకరాచార్యుల ప్రియశిష్యులు హస్తామలకుడు 'భజ గోవిందం' శోకపరంపరలో ...

**అంగం గలితం పలితం ముణ్డం, దశనవిహీనం జాతం తుణ్డమ్**

**వృద్ధో యాతి గృహీత్వా దణ్డం, తదస్తి న ముంచతి ఆశాపిణ్డమ్ ...**

అంటున్నారు. శరీరం ముసలిదైపోయింది. జుత్తు పండిపోయింది. నోట్లో పళ్ళు ఊడిపోయాయి. ముసలివాడై కర్ర పట్టుకొని నడుస్తూ ఉంటాడు. అయినా మానవుడు కోరికల్ని మాత్రం వదలిపెట్టడం లేదని ఆవేదన పడుతున్నారు. నేటి సమాజాన్ని చూస్తూ ఉంటే, ఆ హస్తామలకుడి ఉవాచ నూటికి నూరుపాళ్ళు నిజమనిపిస్తూ ఉంది.

**మసకబారుతున్న మలిసంధ్య ... :** ఈ రోజుల్లో అరవై ఏళ్ళు దాటిన చాలా మంది వృద్ధుల జీవనశైలిని చూస్తూ ఉంటే ఆశ్చర్యమనిపిస్తూ ఉంది. వాళ్ళ అభిరుచులు, అలవాట్లు, ఆహార్యం, ఆడంబరాలు అసహజంగా పరిణమిస్తున్నాయి. నేటి తరంలా, ఆనాటి తరమూ చౌకబారు వ్యవహారాలతో కాలాన్ని గడిపేస్తూ ఉండటం బాధాకరం. పూర్ణత్వం వైపు ప్రయాణించాలన్న తాపత్రయం లేకపోవడం వలన, విషయానందాన్ని మించిన బ్రహ్మానందం





ఒకటి ఉందని తెలుసుకోకపోవడం వలన పళ్ళు ఊడిపోయే వయస్సులో కూడా పాతికేళ్ళ వ్యక్తుల్లా ప్రవర్తిస్తున్నారు. శరీరం సహకరించక మొరాయిస్తున్నా, సుఖాల కోసమే వెంపర్లాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక ఆ భగవంతుడు తప్ప, ఎవరూ ఇలాంటి మనుష్యుల్ని గట్టెక్కించలేరు. అందుకే శ్రీకాళహస్తీశ్వర శతకంలో మహాకవి ధూర్జటి ఇలా వేడుకుంటున్నాడు :

**రోసీ రోయదు కామినీ జనుల తారుణ్యోరు సౌఖ్యంబులన్**

**పాసీ పాయదు పుత్రమిత్ర ధన సంపద్భ్రాంతి, వాంఛాలతల్**

**కోసీ కోయదు నామనం బకట! నీకున్ ప్రీతిగా సత్క్రియల్**

**చేసీ చేయదు దీని త్రుళ్ళణచవే శ్రీకాళహస్తీశ్వరా!**

'ఓ పరమేశ్వరా! నా మనస్సు స్త్రీల యౌవన సుఖాల పట్ల విరక్తి చెంది కూడా, మరలా రక్తిని చెందుతున్నది. నా పుత్రులు, నా స్నేహితులు, నా ధనం, నా సంపదలనే భ్రాంతిని విడిచినప్పటికీ మరలా వెంటపడుతున్నది. ఈ కోర్కెలనే తీగలను తెగకోసినప్పటికీ అవి నాశనం కాకుండా, వాటి వెంట మనస్సు పరుగులెత్తుచున్నది. శంకరా! నీకు ఇష్టమగునట్లుగా మంచి పనులను చేయడం ప్రారంభించినా కూడా విడవడం లేదు. ఈ విధమైన నా మనస్సులోని పొగరును నీవే అణగదొక్కాలి.

**వార్ధక్యం వెంటే వ్యాధులు .... :** యౌవనంలో ఆరోగ్యంగా ఉన్నట్లే వృద్ధాప్యంలోనూ, అంతే ఆరోగ్యంగా, చలాకీగా ఉండాలని చాలామంది తాపత్రయపడుతూ ఉంటారు. అదెలా సాధ్యం? ఎంత పచ్చగా ఎదిగిన మానైనా ఒకానొక నాటికి సడలిపోవలసిందే! ఎంత దృఢంగా పెంచిన శరీరమైనా కాలానుగుణంగా సడలిపోవలసిందే! కానీ, మనలో చాలా మంది పెద్దవారు శరీరానికి ఏ కాస్త అనారోగ్యం కలిగినా, తనకు ఏదో జరగకూడనిది జరిగిపోయిందని దిగులుపడుతూ ఉంటారు. యౌవనంలో కండరాలు బిగువుగా ఉండి కుస్తీపోటీల్లో బంగారు పతకం

సాధించిన కండల వీరుడు కూడా, ముసలితనంలో ఓ మూల కూర్చోవల సిందే! వేలమందికి వ్యాధులు తగ్గించిన వైద్యుడైనా, వార్ధక్యంలో ఆ వ్యాధుల బారినపడి మరో వైద్యుడితో చికిత్స చేయించుకోవలసిందే! కాటికి కాళ్ళు చాచే వయస్సులో, కీళ్ళనొప్పులు రావడం సహజమే కదా! ఇది ప్రకృతి సహజం. అందుకే శరీరానికి సంబంధించిన ప్రతి చిన్న అనారోగ్యానికీ, అసౌకర్యానికీ చింతించాల్సిన అవసరం లేదు. శరీరం కుశలంగా ఉండాలని ఎప్పడూ కోరుకోనూ కూడదు. భక్త కబీర్ ఓ చోట ఇలా ప్రశ్నిస్తాడు :

**కుసల, కుసల సబ్ పూఛతే, కుసల కిసీ కా హెూయ్**

**జరా ము ఈ నా భయ్ ము అ, కుసల కాహే కో హెూయ్!**

'ప్రపంచంలో అందరూ కుశలమా? క్షేమమా? బాగున్నారా? కులాసా యేనా? అని అడుగుతూ ఉంటారు. నిజానికి కుశలం ఎక్కడుంది? ఎవరి కుంది? ముసలితనమూ పోలేదు; మృత్యుభయమూ పోలేదు; అవి ఎలాగూ వస్తాయి. ఇక కుశలమెక్కడిది?' అని ప్రశ్నిస్తాడు.

**కాటు వేసేవి కోరికలే! :** ముఖ్యంగా వార్ధక్యస్థితిని జీర్ణించుకోవడానికి మనస్సు ఇష్టపడదు. అందుకే బలవంతంగా శరీరం పూర్వస్థితిలోనే ఉందనే భ్రమను కల్పిస్తుంది. కోర్కెలను కట్టడి చేయకుండా, వాటివైపు పరుగెత్తిస్తుంది. మట్టిలో కలసిపోయే ఈ మేనికి లేనిపోని మరమ్మత్తులు చేయించమంటూ, కొత్తలో అనిపించేంత మెరుగులు దిద్దించమంటూ ఉంటుంది. కానీ ఎన్ని చికిత్సలు చేయించుకున్నా ఎప్పడో ఒకప్పడు ముఖం ముడతలు పడాల్సిందే! ఎన్ని విదేశీ పేస్టులు వాడి, రోజుకు పదిసార్లు తోముకున్నా దంతాలు ఎప్పటికైనా ఊడిపోవలసిందే! శరీరభాగాలను కలకాలం అదే పటుత్వంతో ఉంచాలనుకోవడం మన అవివేకం. అందుకే వాటి వాడకానికి పరిమితులు విధించాలి. కళ్ళ దగ్గర నుంచి కాళ్ళ వరకు అన్ని భాగాల వినియోగాన్నీ రానురానూ తగ్గించుకుంటూ ఉండాలి. ఇది





కేవలం మానసిక, శారీరక కోర్కెలను నియంత్రించినప్పడే సాధ్యపడు తుంది. లేనట్లయితే ముసలి ఎద్దుకు కావడి కట్టి, మండుటెండలో పొలం దున్నించినట్లు అవుతుంది. ఆహారం నుంచి ఆహార్యం వరకు అన్ని విషయా ల్లోనూ పూర్తిగా వైరాగ్యాన్ని అలవరచుకోవాలి. అనుభవించింది చాలు! ఇవి నాకిక సరిపడవని మనస్సుకు నచ్చజెప్పకోవాలి. దేహంపై నుంచి దృష్టిని మరల్చి, వాంఛల వడిని తగ్గించుకోమనాలి. ధారావాహికలు వీక్షించడం, దారినపోయే ప్రతి ఒక్కరి విషయాలను తెలుసుకోవాలనే ఉత్సుకతను మానుకోమనాలి. అందుకే కోరికలు, కామ కాంచనాల ఆసక్తి ఉన్నంత వరకు దేహశుద్ధి నశించదు. విషయాసక్తత తగ్గినప్పడు ఆత్మ జ్ఞానం వైపు పురోగమించవచ్చు. దేహబుద్ధీ తగ్గుతుంది. చివరకు విషయా సక్తి అడుగంటా నశిస్తేనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుని వైపు మనస్సు మరలుతుంది' అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

**భగవంతుడు ... భాగవతమే దిక్కు! :** కోరికల వలలో పడితే ముదిమి లోనూ మనస్సు భగవంతుడికి దగ్గర కాదు. పైగా వాంఛలు తీర్చుకోవడానికి వాటాకు వస్తున్నాడని ఈ తరం వారు ఈసడించుకుంటూ ఉంటారు. పోయే కాలంలోనూ ఈ పోకడలేంటని ముక్కున వేలేసుకుంటారు. అందుకే ఇలాంటి దౌర్భాగ్యస్థితి రానివ్వకూడదని ఆ భగవంతుణ్ణి ప్రార్థిం చాలి. వయస్సుకు తగ్గ హుందాతనాన్ని ప్రసాదించాల్సిందిగా వేడుకోవాలి. వీలైనంత వరకు తమకంటూ ఓ కొత్త వాతావరణాన్ని సృష్టించుకోవాలి. ఆ ఏకాంతంలో భగవంతుడికి దగ్గరయ్యే ప్రయత్నం చేయాలి. మన జీవితాలను గట్టెక్కించే శ్రీమద్భాగవతం, శ్రీరామకృష్ణ కథామృతం లాంటి ఎన్నో పవిత్ర గ్రంథాలను ఆశ్రయించాలి. సాక్షాత్తూ భగవంతుడి నోటి నుంచి వెలువడిన పవిత్ర బోధనలని, మనం దిగాల్సిన స్టేషన్ రాబోతుందని తెలిసి, అప్పటివరకూ మనతో కలిసి ప్రయాణించిన వారికి వీడ్కోలు పలికి, ఎలాగైతే సామాగ్రి సర్దుకొని, దిగిపోవడానికి సిద్ధమవుతామో, అలాగే జీవన

యానంలో నుంచి నిష్క్రమించేందుకు కూడా సంసిద్ధులం కావాలి. అలా కాకుండా ఇంకా కోరికల వెంటే పడ్డ వారికి రాకూడని కష్టాలు వస్తాయంటూ శ్రీ మద్భాగవతంలో ఋషభదేవుడు....

**..... ధరలోన పుట్టిన, పురుషులకును శునకములకు లేని**

**కష్టములు తెచ్చు కొన, కామంబుల వలన బుద్ధి సేయవలదు!**

'ఈ గడ్డ మీద పుట్టిన మనుష్యులు కామానికి లొంగిపోతే కుక్కలకు కూడా రాని కష్టాలు ఎదురవుతాయి. అందువల్ల కోరికలకు దూరంగా ఉండాల'ని హితవు పలుకుతాడు.



# ఎవరికి ఉపదేశం చెయ్యాలి

**- గౌతమ బుద్ధుడు**

ఒకసారి అతడు మగధ దేశంలో పర్యటిస్తూ అళవి అనే కుగ్రామం చేరాడు. ఆ మారుమూల గ్రామస్థులెంతో ఆనందపడ్డారు. సంభ్రమంలో మునిగిపోయారు. మహామహా చక్రవర్తులే గౌతమబుద్ధుడి ముందు చేతులు కట్టుకుని నిలబడతారని వారికి తెలుసు. అలాంటిది అంత గొప్ప వాడు వాళ్ల ఊరికే దయచేయడంతో వారి ఆనందానికి హద్దులు లేవు.

ఆనాడు సాయంకాలం బుద్ధ భగవానుని ప్రవచనం మొదలయ్యే సమయానికి ఒక రైతు బిడ్డ ఆదరా బాదరాగా వచ్చి కూర్చున్నాడు. అతడు బాగా అలసిపోయి ఉన్నాడు. ఎంతో ఆకలి దహిస్తున్నా, బుద్ధ భగవానుని ఉపదేశం వినడానికి పరిగెత్తుకుంటూ వచ్చి కూర్చున్నాడు. అతడు ప్రొద్దుటి నుండి ఏమీ తినలేదు. తప్పిపోయిన ఎద్దుని వెతకడానికి వెళ్లి, ఎట్లాగైతేనేం దాన్ని పెట్టుకుని ఊళ్లోకి రాగానే గౌతమబుద్ధుని రాక సంగతి తెలిసి ముఖం కూడా కడుక్కోకుండా గబగబా ఇంటికి చేరి ఎద్దుని కట్టేసి సమావేశ స్థలానికి పరుగు పరుగున చేరాడు.

గౌతమబుద్ధుడు డస్సీ ఉన్న ఆ రైతు బిడ్డను చూచాడు. ఆ రైతు బిడ్డలో





జ్ఞానం పట్ల ఎంతో మమకారం, ఉత్సాహం కనబడ్డాయతడికి అతడికి ధర్మదీక్ష నిస్తే త్వరలోనే అతడు అర్హుడు కాగలడనిపించిందతడికి- వెంటనే గ్రామ పెద్దను పిలిపించి, ఆ రైతు బిడ్డకి మొదట కడుపునిండా అన్నం పెట్టించి తీసుకురమ్మనమనీ వారు వచ్చేవరకూ ప్రవచనం మొదలు పెట్టననీ చెప్పాడు. ఆ గ్రామ పెద్ద గౌతమబుద్ధుని ఆదేశాన్ని గొప్ప అనుగ్రహంగా తీసుకొని, ఆ రైతు బిడ్డని అప్పటికప్పుడు ఇంటికి తీసుకు వెళ్లి కడుపునిండా భోజనం పెట్టించి సమావేశస్థలానికి తీసుకువచ్చాడు.

గౌతమబుద్ధుని ప్రవచనాలను ఆ గ్రామ ప్రజలు ఎంతో శ్రద్ధగా విన్నారు. ఆ రైతుబిడ్డ మరింత శ్రద్ధగా విన్నాడు. బుద్ధుడు ఊహించినట్లుగానే కొద్ది కాలంలోనే భౌద్ధభిక్షువయ్యాడు.

అతడికి అలా శ్రద్ధగా ఆహారం పెట్టించడానికి కారణం అడిగిన మిగిలిన శిష్యులకు గౌతమ బుద్ధుడు, ఆకలి బాధ చాలా దారుణమయింది. ఆకలి బాధతో ఉన్న వాడికి వినోదప్రసంగం అయితే కాస్త మరపించగలదు. కానీ మనం చెప్పేది వినోద ప్రసంగం కాదు కదా! జ్ఞాన బోధ. ఆకలి అనేది మనిషికి మొండి రోగం లాంటిది. అన్నమనే ఔషధాన్ని అతడు తప్పని సరిగా తీసుకోవాల్సిందే. జ్ఞానాన్ని పొందడానికి ఆకలి అడ్డురాకూడదు అని చెప్పాడు.

ఆ విధంగా అతడు ఆకలి తీర్చుకోవడాన్ని జ్ఞానాన్ని పొందడం కన్నా మొదటిగా, ముఖ్యమైనదిగా భావించాడు. మరియెంతో మంది పేదవారు ఉన్నారు. వారందరూ జ్ఞానసంపన్నులు కావాలంటే వారికి ఆకలిదప్పులు బాధలు ఉండకూడదు. ఎంత కొద్దిగా అయినా సరే వారి ఆకలి దప్పులను పోగొట్టే మార్గమేది?

**బహుశ:** ఈ సంఘటన, ఇటువంటి సంఘటనల వలననే విద్య గరిపేందుకు నిరాడంబరమైన ఆశ్రమాలు అరామాలు, వసతి గృహాలు కట్టించడానికి గౌతమబుద్ధుడు అనుమతించాడు. అటువంటి ఆశ్రమాలు విద్యాలయాలై అతి త్వరలోనే ప్రజలు-జ్ఞాన బోధ పొందడంలో, కొందరు అర్హులు కావడంలో మంచి సత్ఫలితాలనిచ్చాయి. దానితో యిలా ఆరామాలు విద్యాలయాలు కట్టించడాన్ని ఎంతో అభినందించాడు, ప్రోత్సహించాడు.

# రామకోటి వ్రాయటం వల్ల ప్రయోజనం

- సౌమిత్రి

ఇప్పుడు క్రైస్తవులు సువార్త కూటముల పేరుతో సభలు నిర్వహించి అందులో జబ్బుగా వున్న వారికి రోగం నయం కావటానికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని జనాన్ని సమీకరిస్తున్నారు. అనేకమంది డబ్బులు పెట్టి వైద్యం చేయించుకోలేక ఈ సువార్త కూటములకు వెళ్ళి మతం పుచ్చుకుంటు న్నారు. ఇళ్లల్లో పనిమనుషులు, కూరగాయలమ్మే వారు, ఎరుక, ఏనాది వారు ఈ విధంగా క్రైస్తవులుగా మారుతున్నారు. కానీ, హిందువులు మాత్రం తమకేమీ పట్టనట్లు ఊరుకుంటున్నారు. ఇది చాలా దారుణం. శ్రీరామకోటి వ్రాయటం ద్వారా క్షయవ్యాధి నయమయిన సంగతి ఇక్కడ పేర్కొంటున్నాము.

గుంటూరు సమీపంలోని అంకిరెడ్డిపాలెంలో ఉపాధ్యాయులుగా పని చేసిన స్వర్గీయ దేవగిరి వెంకటరెడ్డిగారు తమ స్వానుభావాలను ఇలా వివరించారు.

అది 1993వ సంవత్సరం. నాకపుడు 14 సంవత్సరాలు. విపరీతమైన దగ్గుతో, కళ్లెతో బాధపడుచున్నారు. గుంటూరులో అల్లోపతి వైద్యులకు చూపించారు. క్షయ వ్యాధి అన్నారు. మందులు వాడుతున్నారు. గుణం కనిపించడం లేదు.

24 గంటలలో ఏ ఒక్క గంటో పరుండేవాడిని. మిగతా రోజంతా కూర్చొని వుండవలసిందే. నాటు మందులు కూడా వాడాను. ప్రయోజనం లేదు. ఇలా మూడు సంవత్సరాలు జబ్బుతో పోరాడుచున్నాను. ఇది తగ్గే జబ్బు కాదని రూఢి అయినది. అందుచేత మా నాన్నగారు నన్ను వదిలిపెట్టి మా తమ్మునికి వివాహం చేశారు.

ఇలా ఉండగా ఒకరోజు గుంటూరులో జరిగే శ్రీరామకోటి ఉత్సవాలను





చూద్దామని వెళ్ళాను. ఇపుడున్న రామనామ క్షేత్రం అప్పటికి నిర్మాణం కాలేదు. అగ్రహారంలో నరసింహస్వామి గుళ్లో ఉత్సవాలు జరిపారు. ఎవరో వచ్చి శ్రీరామ నామ మహిమను గురించి ఉపన్యాసం ఇస్తుంటే విన్నాను. ఇపుడు రామనామ క్షేత్రం నిర్వహిస్తున్న శ్రీ ఆంజనేయులుగారు ఆ సభను నిర్వహించారు.

ఆనాటి ఉపన్యాసకుడు 'శ్రీరామ నామము ఎంతో మహత్తరమైనది. ఆ నామము జపించినా, శ్రీరామకోటి వ్రాసినా మనకష్టాలు తొలగి పోతాయి. వ్యాధిగ్రస్తులకు జబ్బులు నయమవుతాయి. బిడ్డలు లేని వారికి సంతానం కలుగుతుంది. రామ నామంలో వున్న మహత్తు మాటలలో వర్ణించలేము. అది ఎంతో శక్తివంతమైనది' అని చెప్పారు.

నేను ఉపన్యాసం విన్నాను. నాకు జబ్బు నయం కాదని అందరూ పెదవి విరిచారు. అందుచేత మందులు పూర్తిగా ఆపివేసి శ్రీరామ కోటి అత్యంత భక్తితో వ్రాయడమారంభించాను. నెలకు లక్ష నామములు వ్రాస్తు న్నాను. కొంతకాలం వ్రాసే సరికి క్రమంగా క్షయ వ్యాధి నుండి విముక్తుడ నైనాను. నాకే ఆశ్చర్యం వేసింది.

2 సంవత్సరాల 4 నెలలకు ఒక కోటి నామం వ్రాశాను. నాకు ఎక్కడ లేని ఆనందం కలిగింది. చచ్చిపోయి బ్రతికినంత సంతోషం కలిగింది. ఊళ్లో కూడా శ్రీరామనామం వల్లనే బట్ట కట్టావు అన్నారు. ఒక కోటి నామం పూర్తికాగానే ఊళ్లో పెద్ద సమారాధన చేశాను. ఎద్దు బండిలో శ్రీరామకోటి పుస్తకాలు పెట్టి మేళతాళాలతో ఊరేగిస్తూ గుంటూరు పోయి శ్రీరామ నామ క్షేత్రంలో వాటిని సమర్పించి వచ్చాను.

అదేరీతిలో అనుదినం రామకోటి వ్రాస్తూనే ఉన్నాను. రోజుకు వెయ్యి నామాలు వ్రాస్తాను. ఇపుడు నా వద్ద 2 కోట్ల నామం వ్రాసి ఉన్నది. వీటిని భద్రాచలం వెళ్ళి దేవాలయంలో సమర్పించాలనుకుంటున్నాను.

తరువాత నాకు వివాహమైంది. నలుగురు బిడ్డలు కలిగారు. అందరూ

ఆరోగ్యంగా వున్నారు. ఉన్నత చదువులు చదివారు కొంతకాలం క్రిందట పిల్లల బొమ్మల రామాయణం చూచాను. నాకు కూడా రామాయణాన్ని చిత్రములుగా గీయాలనీ, ఆ చిత్రములను శ్రీరామ నామంతో అలంకారం చేయాలనీ కోరిక కలిగింది. ఆ విధంగా పెద్ద సైజులో 52 బొమ్మలు రంగులతో తీర్చిదిద్దాను. వాటిలోకెల్ల సుందరకాండ గురించిన బొమ్మలు నా హృదయానికి మహదానందం కలిగిస్తాయి.

అనుదినం శ్రీరామకోటి వ్రాసిన పిదప సుందరకాండలో ఒక సర్గ పారాయణ చేస్తాను. అశోకవనములో ఆంజనేయుని సంభాషణ వారికి చాలా ఇష్టమైనది. సాయంకాలం భగవద్గీతలో ఒక అధ్యాయం పారాయణ చేస్తాను. ఇప్పటికి 114 సార్లు గీతాపఠనం చేశాను.

**మరియొక పద్ధతి :** శ్రీరామ కోటి వ్రాయలేని వారు మరియొక మార్గము ననుసరించవచ్చును. ప్రతిదినమూ ఉదయమూ, సాయంకాలము పళ్లెంలో బియ్యము పోసుకొనవలెను. ఆ బియ్యపు గింజలను, శ్రీరామ శ్రీరామ అంటూ మరియొక గిన్నెలో వేయుచుండవలెను. అట్లు రామ నామముతో ఏర్పడిన బియ్యపు గింజలను, అన్నముగా వండుకొని భుజింప వలెను. ఇట్లు చేసినను కూడా రోగములు నయము కాగలవు.

**సముద్ర మధ్యంలో పెద్ద శిల నిలబడి ఉంది. పెద్దపెద్ద అలలు వచ్చి దాన్ని కొడుతున్నాయి. చిన్న చిన్న పడవలు తాకి పోతున్నాయి. తిమింగలాలు తోకలతో రొడుతున్నాయి. శిల నిశ్చలంగా అలాగే నిలబడి ఉంది. జీవితంలో ఎదురయ్యే కఠోర పరిస్థితులనూ, ఆపదలనూ అలాగే నిశ్చలంగా సహిస్తాడు ధీశాలి.**

**- అరవింద**







# THE TEACHER

**- SWAMI CHINMAYANANDA**

A man firmaly established in wisdom is tranquil and his equipoise is never broken even when he is investing his entire energies in the world outside for the service of manking.

The words coming from an individual can gather wings only when they can spring from a heart soaked in an utmost subjective experience. The teacher will have to explain in terms of the intellect that which is beyond the intellect. This early catering is the intellect is possible only when the teacher knows the techniques employed in the Upanishads by the great Rishis of old in conveying and explaining the inexplicable. However much we explain, the actual transference of knowledge from the teacher to the taught is not through words. For this the power of communication must be in the teacher and this he can discover only from his own experience.

The behaviour of a teacher in the world must be perfect in all respects. The teacher must have large heartedness flowing kindness and patience. These are necessary because in the early stages, the students will revolt against new concepts which are at this moment against their present undertakings. To weed out the mind and to re plant new ideas, is a most painful operation, and this can be achieved only when the teacher has infinite patience, endless love and supreme affection. He in whose presence you feel elevated and inspired he is your teacher. He with whom when you compare your own life you feel ashamed of your own weakness, he is your teacher. He whom when you remember, you feel cooled down even at moments of burning passions, he is your perceptor. In fact the true teacher to all of us is the Lord of our Heart. He talks to us very often through his chosen deputy. Reverse him and worship him.

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ఆ రోజు సాయంత్రం స్వామీజీ పవిత్రదేహానికి శాస్త్రోక్తంగా పూజలు జరిపించి సుందరంగా అలంకరించిన జీపులో షిరిడీ పురవీధుల గుండా (మారుతీ మందిర్ చావడి, మహల్సాపతి గృహం, కానిఫ్‌నాథ్ మందిర్, గురుస్థాన్, బూటీవాడా, లెండీబాగ్) స్వామీజీ ప్రతి నిత్యం చావడిలో గానం చేసే భజనలతో, సాయి నామ సంకీర్తనలతోనూ, పుష్పాలు జల్లుతూ, హారతులిస్తూ స్వామీజీ ఆశ్రమం కోసం క్రయం చేసిన స్థలానికి తీసుకు వెళ్లి వేద పురోహితులచే శాస్త్రోక్తంగా స్వామీజీ అంత్యక్రియలు జరిపించారు. శ్రీ కె.ఎస్.సుబ్రహ్మణ్యం (మణి) స్వామీజీ అంత్యక్రియలు చేసారు. స్వామీజీ పవిత్రదేహానికి అగ్ని సంస్కారం జరిపించి భక్తులందరూ బాధాతప్త హృదయాలతో బాధపడటం చూడలేని సూర్యుడస్తమించాడు. స్వామీజీ భక్తులు స్వామీజీ అస్తికలను భారతదేశంలో గల అన్ని పవిత్ర నదీజలాల్లో నిమజ్జనం చేసి స్వామీజీ యందు వారికి గల భక్తి, ప్రపత్తులను చాటు కున్నారు. స్వామీజీ సమాధిని 21.02.1996 తేదీన నిర్మించారు. ఈ పరమపూజ్యుని మహాసమాధి పింపుల్‌వాడి రోడ్డులో ప్రసాదాలయం నుండి రెండున్నర కిలోమీటర్ల దూరం గలదు. 'ఇచట ప్రతి నిత్యము నాలుగు హారతులు జరుగుతున్నవి. ధునిని కూడా ఏర్పాటు చేసారు. స్వామీజీ జన్మ దినమైన ఏప్రిల్ 12వ తేది, పుణ్యతిథి ఫిబ్రవరి 12వ తేది మరియు గురు పూర్ణిమ ఉత్సవములు అంగరంగ వైభవముగా జరుగును. షిరిడీ దర్శించే ప్రతి సాయి భక్తుడు ప్రశాంత వాతావరణంలో గల స్వామీజీ ఆశ్రమాన్ని దర్శించి బాబా మరియు స్వామీజీల ఆశీస్సులు పొందగలరు





**సమాధి అనంతర లీలలు :**

బాబా మహాసమాధి చెందిన మరుక్షణం నుంచే అనేక లీలలను ప్రదర్శించుచూ తాను సదా సజీవుడేనని తన భక్తుల నెన్నటికి వీడనన్న తన అభయాన్ని ఋజువు చేసుకుంటున్నాడు.

సాయివలెనె మన స్వామీజీ కూడ తన సమాధి అనంతరం అనేక మందికి సశరీరులుగాను మరి కొంతమందికి స్వప్న దర్శన భాగ్యము కలుగజేసి వారి కష్టముల నీడేర్చుచున్నారు.

స్వామీజీ భక్తుడైన గోవా నివాసియగు చాందోర్‌కర్ మేనల్లునికి స్వామీజీ సశరీరులుగా దర్శనమిచ్చి "నన్ను గుర్తుపట్టావా?" యని ప్రశ్నిం చగా అతను వెంటనే "మీరు శివనేశన్ స్వామీజీ, మీరు నాకు ప్రసాదించిన సాయి భజన మాలపుస్తకాన్ని నా పూజా మందిరమందుంచి పూజించు కుంటున్నాన"ని సమాధానమిచ్చెను. స్వామీజీ అతని చేతిలో రెండు రూపా యల నోటు నుంచి గుప్పెటమూయమనగా అతను అట్లే చేసెను. స్వామీజీ గుప్పెట తెరువమని చెప్పగా అందులో రెండు రూపాయల నోటు బదులు గులాబి పుష్పం ఉంది. ఇంతలోనే వేరొక ఫకీరు వేషధారి వచ్చి తాను మహారాష్ట్రం నుంచి వస్తున్నట్లు చెప్పి తనకు ఐదు రూపాయల నోటు బదులు గులాబిపుష్పం ఉంది. ఇంతలోనే వేరొక ఫకీరు వేషధారి వచ్చి తాను మహారాష్ట్రం నుంచి వస్తున్నట్లు చెప్పి తనకు ఐదు రూపాయల దక్షిణ కావాలని అడుగగా ఆ యువకుడు తన జేబులో నుంచి తీసి ఇవ్వబోగా ఇవి కాదు నీ దుకాణంలోంచి తీసుకువచ్చి ఇవ్వు అని అతని దుకాణంవైపు చూపించారు. అతను వెంటనే దుకాణంలోకి వెళ్లి ఐదు రూపాయలు తెచ్చి ఇవ్వగా అతనిని ఆశీర్వదించి స్వామీజీ మరియు ఆ ఫకీరు వేషధారి కొంతదూరం వెళ్లి అతను గమనించుచుండగానే కనుమరుగయ్యారు.

షిరిడీ వాసియగు కుమారి దేశ్‌ముఖ్ గారికి స్వామీజీ ప్రసాదించిన మరొక అనుభవము -

1995 ఆగస్టు లేక సెప్టెంబరు మాసంలో ఈమె దగ్గు, వాంతులతో బాధపడుతుంటే స్వామీజీ త్రిఫలచూర్ణము మరియు అల్లంతో తయారు చేసిన ఒక చాక్లెట్టును ఇచ్చారు. అది తినగానే రెండు రోజులకే ఆమెకు స్వస్థత పొందెను. స్వామీజీ మహాసమాధి చెందిన తరువాత మార్చి 9వ తేది 1996న తిరిగి దగ్గు, వాంతులు కావటంతో ఆమె స్వామీజీని తల్చు కొని "స్వామీ ఇదివరకు ఈ వ్యాధిని మీరే నయం చేసారు ఇప్పుడు నాకు దిక్కెవ్వరు?" అని స్వామిని ప్రార్థించి నిదురించగా స్వామీజీ స్వప్నంలో దర్శనమిచ్చి ఆమెకు అంతకుముందు ఇచ్చిన చాక్లెట్లు వంటిదే ఇచ్చి అంత ర్థానమయ్యారు. తెల్లవారిన తరువాత నిద్రలేచి ముఖప్రక్షాళనం చేసు కుంటూ రాత్రి స్వామీజీ చాక్లెట్టు ఇచ్చిన సంగతి జ్ఞప్తికి వచ్చి చూడగా మంచం మీద చాక్లెట్టు ఉన్నది. దానిని తీసుకొని కళ్ల కద్దుకొని నోట్లో పెట్టుకొని చప్పరించగా కొద్దిక్షణాలలోనే ఉపశమనం కలిగింది. ఆమె ఉద్యోగానికి వెళ్ళే సమయం కావటంతో తొందరగా స్నానమాచరించి ఆఫీసుకు వెళుతుంటే స్వామీజీ సమాధి చెందారు గదా మరి రాత్రి చాక్లెట్టు ఎవ్వరు ఇచ్చారన్న సందేహం కలిగింది. అది స్వప్నమని సరిపెట్టుకుందా మంటే స్వప్నంలో ఇచ్చిన చాక్లెట్టు స్వయంగా తన మంచం మీదకు ఎలా వచ్చిందని ఆశ్చర్యపడి అది స్వామి ప్రసాదించిన ప్రసాదమని గ్రహిం చెను. తనను నమ్ముకున్న వారిని స్వామీజీ ఏనాడు అలక్ష్యం చేయరని ఈ సంఘటన ఋజువు చేస్తోంది.

స్వామీజీ మహాసమాధి చెందిన తరువాత శివరాత్రి గడచిన రెండు రోజులకు హైదరాబాదు వాస్తవ్యులు శ్రీయుతులు రాజు మరియు రామా రావు అనే ఇరువురు భక్తులు షిరిడీకి వెళ్ళి ధునికి నమస్కరించు చుండగా స్వామీజీ మేస్త్రీలు ప్లాస్టరింగ్ చేయటానికి ఉపయోగించే బద్దను భుజాన పెట్టుకొని ద్వారకామాయి నుంచి బుట్టి వాడాకు వెళుతూ దర్శనమివ్వగా వారు స్వామిని అనుసరించగా బుట్టి వాడాలోనికి ప్రవేశించగానే స్వామీజీ అంతర్థానమయ్యారు. **(సశేషం)**





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

మురాసురుడు, అతని కొడుకులు ఆ అలజడికి, ఆ ధ్వనికి చకితులై నారు. వారు హడావిడిగా వచ్చేసరికే దుర్గద్వారం గరుడులకు స్వాధీన మైంది. మురాసురుడు ప్రళయంకరమైన ఆవేశంతో ముందుకు వచ్చి కృష్ణుణ్ణి ఉద్దేశించి, 'చావును నొసట వ్రాసుకుని వచ్చిన ధూర్తుడా! ఎవరు నీవు' అని తన ముద్గరాన్ని పైకెత్తి ఆక్రోశించాడు.

ఆ క్షణం రానే వచ్చింది. శ్రీకృష్ణుడు ఎవరికీ అవకాశం ఇవ్వదలచు కోలేదు.

'ఓరీ! ఇన్నాళ్ళుగా నీ ప్రభువూ, మీరూ చేసిన రాక్షసాలకు ఇదే శిక్ష' అంటూ చేతి చక్రాన్ని గిరిగిర త్రిప్పి వదలాడు. ఆ చక్రం మిరుమిట్లు గొలు పుతూ, వెలుగులు జిమ్ముతూ, విద్యుత్‌వేగంతో, ఏమి జరుగుతున్నదో ఊహించలేనంత వేగంగా ప్రయాణించి మురాసురుని తలను మొండెం నుంచి వేరుచేసింది.

అది జరిగిన మరుక్షణం అతని కుమారులు ఏడుగురు కత్తులు ఝుళిపిస్తూ రథంవైపుకు పరుగెత్తుకొని వచ్చారు. ప్రక్కనే ఉన్న వైనతేయుడు, కృష్ణుని సరసన నిలచిన సత్యభామ, శ్రీకృష్ణుడు ధనువుల నెక్కుపెట్టి ఆ ఏడుగురిని అక్కడికక్కడే నేలకూల్చారు.

మురాసురుని భటులు వేగంగా పరుగెత్తుకొని వెళ్ళి నరకాసురునికి ఈ వార్త చేరవేశారు. 'ఎవడో రథం మీద వచ్చాడు. చేత చక్రం ధరించి, దానిని వదలి మురాసుర సేనాధికారిని సంహరించాడు. ఒక స్త్రీ-శక్తి రూపిణి- ఆయన ప్రక్కనే ఉన్నది. ఒక గరుడ మహాయోధుడున్నాడు. వాడు

మురాసురుల వారి పుత్రులను చంపాడు, దుర్గంలోకి ప్రవేశించి ఇటే వస్తున్నారు ప్రభూ' అని నివేదించారు.

నరకాసురుడు క్షణంలో కవచ, శిరస్త్రాణాదులు ధరించాడు. ఆయుధాలు తీసుకున్నాడు. అతని రాజ్యంలో ఉన్న ధానుష్కుల్లో గురి తెలిసిన కొందరిలో అతడే సర్వశ్రేష్ఠుడు, సాధన చేసి వైష్ణవాస్త్రాన్ని సాధించినవాడు.

ప్రాగ్జ్యోతిషం ఇంతవరకు దేవతలకు కూడా దుర్భేద్యమైన దుర్గం. అలాంటి దుర్గమ దుర్గంలోకి ప్రవేశించిన దుష్టుడెవడో! నరకుడు మహోగ్రుడై తన ఏనుగు సుప్రతీకాన్ని ఎక్కి వచ్చాడు. సుప్రతీకం తన ఘనపాదాల ఘట్టనంతో ఘీంకరిస్తూ ముందుకు నడిచింది. నరకుడు ఎదురుగా రథం మీద పాంచజన్య శంఖారావం చేస్తూ వస్తున్న శ్రీకృష్ణుణ్ణి చూచాడు.

'ఎవరు నీవు! ఎంత ధైర్యంతో స్త్రీని వెంటబెట్టుకొని వచ్చావు? నాచేత నీ చావు తప్పదు. నా స్త్రీ శిబిరంలో నీవెంటనున్న స్త్రీకి ప్రవేశం తప్పదు'.

'పదహారు వేలమంది స్త్రీలను అపహరించిన నిన్ను నారీశక్తికి బలి ఇవ్వడానికే నేను వచ్చాను' అని సత్యభామ గర్జించింది.

'అసలు ఎవరు మీరు?' అని రెట్టించాడు నరకుడు.

'నేనా? నేను ద్వారకాధిపతిని. కృష్ణవాసుదేవుణ్ణి. నిన్ను సంహరించి, నీ బందీలుగా ఉన్న స్త్రీలను విడిపించడానికి, ధర్మస్థాపనకు వచ్చిన వాణ్ణి' అన్నాడు కృష్ణుడు.

'ఓహో నీవా! మా మిత్రుడు జరాసంధుని అల్లుడైన కంసుణ్ణి చంపిన హంతకుడివి నీవే కదూ! నీ రక్తంతో నా స్నేహితుని అల్లునికి తర్పణాలు విడుస్తా'నంటూ తన ముద్గరాన్ని తీసుకుని విసిరాడు.

దానిని సత్యభామ మధ్యలోనే తన బాణ పరంపరతో ఖండించింది.

నరకాసురుడు ఇక ఆలస్యం చేయదలచుకోలేదు. చుట్టూ నగరవాసులు భయభ్రాంతులై పరుగులు తీస్తున్నారు. నాగులు, గరుడులు, యాదవులు నగరంలో యథేచ్ఛగా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుతున్నారు. నరకుడు చివరి ప్రయోగంగా వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించడానికి పూనుకున్నాడు. అతని గజసేన, కొద్దిపాటి అశ్వదళం కూడా సిద్ధమవుతున్నది.





కృష్ణునిది యోగదృష్టి, నరకాసురుని ఆంతర్యాన్ని గ్రహించాడు. ద్వారకలో వృద్ధ శ్రోత్రియుడు తనకు నరకుల వైష్ణవాస్త్రాన్ని గురించి వివరించాడు. దానికి విరుగుడు ఒక్కటే. అది ప్రయోగింపబడకముందే నరకుని తుదముట్టించాలి.


వెంటనే కృష్ణుడు చక్రాన్ని తర్జనిపై తీసుకొని, దానిని గిరగిర త్రిప్పి ప్రయోగించాడు. చక్రం నిప్పులు గ్రక్కుతూ, విద్యుత్తు పయనించినంత వేగంగా ముందుకుసాగింది. క్షణంలో దుర్దాంతబలుడు, దేవలోకాన్ని ధిక్కరించినవాడ, పరమఋషి కశ్యపుని దేవేరి కుండలాలను హరించినవాడు, త్రివిష్టప ప్రభువు వారుణచ్ఛత్రాన్ని అపహరించిన దుర్మార్గుడు, సనాతన ధర్మాన్ని ధిక్కరించి, తాపసులను శ్రోత్రియులైన ప్రజలను, పదునారువేల ఒక వందమంది తల్లులను నరకయాతనల పాలుచేసిన ఆ ఆకతాయి నరకుడు, కృష్ణుడు ప్రయోగించిన ఆ చక్రధారకు తలతెగి నేలకొరిగాడు. చుట్టూ ఉన్న జనం హతబుద్ధులైనారు. ప్రాగ్జ్యోతిషమే కొడికట్టి ఆరినట్లైంది.

నరకుని కుమారుడు భగదత్తుడు, తల్లి భూదేవి ఈ వార్తకు స్తబ్దులైనారు. శ్రీకృష్ణుని పరాక్రమగాథలను వారు ఇదివరకే విని ఉన్నారు. కృష్ణస్వామితో వైరం ఊహించరానిది. ఆ ఇద్దరూ నరకుని శవం మీద పడి గుండెలవిసేటట్లు విలపించారు. నరకుని భార్యలు కుప్పకూలిపోయినారు.

భూదేవి భగదత్తుణ్ణి తన వెంటతెచ్చి కృష్ణుని చరణాలకు నమస్కరింపజేసింది.

**తస్యాత్మజోయం తవ పాదపంకజం**
**భీతః ప్రపన్నార్త హరో పసాదితః**
**తత్పాలయైనం, కురు హస్త పంకజం**
**శిరస్య ముష్యాఖిల కల్మషాపహమ్!**

శ్రీకృష్ణుని వారిని ఓదార్చాడు. **(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

శ్రీ సాయి చరణాలకు దాసగణు భక్తిశ్రద్ధలతో శరణాగతి చెందేంత వరకు, ఇంకో విధంగా చెప్పాలంటే సాయి సాంప్రదాయంలో అత్యంత ఆవశ్యకమైన శ్రద్ధ సబూరీలను సమర్పించేంతవరకు, శ్రీ సాయియే అదృశ్య రూపంలో దాసగణు చేయి పట్టుకొని నడిపిస్తున్నారని మనకు ధృవీకరించే ఇంకొక విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. అసలు ఆ మంత్రోపదేశం ఘటనలో అద్భుతమైన ఎన్నో భిన్న కోణాలు ఆవిష్కృతమవుతాయి. “ఉద్యోగాన్నే గురుదక్షిణగా సమర్పించవలసి ఉంటుంది. కానీ, ఇంకా సమయముంది. ప్రస్తుతానికయితే రెండు పైసలు (శ్రద్ధ సబూరీలు) దక్షిణగా ఇవ్వు” అనే క్రమమే దాసగణు బాబా వద్దకు వచ్చాక కూడా కొన్ని రోజులు జరిగింది. దాసగణు బాబా వద్దకు వచ్చీరాగానే బాబా తనను “ఉద్యోగాన్ని వదలివేయమని” ఆజ్ఞాపించలేదు. మొట్టమొదట నానాసాహెబ్‌తో కలసి యథాలాపంగా బాబా వద్దకు వచ్చిపోవడమే జరిగింది. ఆ క్రమంలో తాను స్వయంగా చూసిన లీలలు, సహచర భక్తుల నుండి విన్న అనుభవాలు, హృదయానికి హత్తుకునేటట్లు నానాసాహెబ్ బాబా మహిమలను వర్ణించే తీరు, బాబా సన్నిధిలో అనుభవమవుతున్న తెలియని శాంతి ఆనందాలు, అన్నింటిని మించి “బాబా గొప్ప మహాత్ములు. ఆయన చరణాలను అనన్యంగా ఆశ్రయించమని” వామనశాస్త్రిగారు చేసిన బోధ దాసగణు హృదయంపై క్రమంగా పరిణామం చూపించడంతో క్రమక్రమంగా తనకు బాబా పట్ల భక్తిశ్రద్ధలు కుదురుకోవడం మొదలుపెట్టాయి. తరువాతి రోజులలో బాబా ఆజ్ఞానుసారం మహాత్ముల చరిత్రను వ్రాసేటప్పుడు ఆ మహాత్ముల జీవనాన్ని సమీపం నుండి తూలనాత్మకంగా పరిశీలించే ప్రక్రియలో బాబా





వద్ద వ్యక్తమవుతున్న అవ్యాజమైన ప్రేమ, అలౌకిక శక్తి మరియు భక్త సులభత తనకు బోధపడి, “సాక్షాత్తు ఆ భగవంతుడే సాయి రూపంలో నడయాడుతున్నాడు” అనే సత్యం దృఢమవుతున్న దశలో అంటే శ్రద్ధ సబూరీలను కొంచెంగానయినా సమర్పించిన నేపథ్యంలో బాబా తాము సంకల్పించిన గురుదక్షిణను సమర్పించమని (ఉద్యోగాన్ని వదలివేయమని) అడిగారు. ఆ గురుదక్షిణను స్వీకరించే ప్రక్రియలో కూడా అంటే దాసగణుచే ఉద్యోగాన్ని వదిలించే క్రమంలో కూడా రామయ్య వంటి మహనీయుల సత్సాంగత్యాన్ని ప్రసాదించడం ద్వారా మరియు విష్ణు సహస్ర నామం, దాసబోధ, జ్ఞానేశ్వరి వంటి ఉచ్చశ్రేణి గ్రంథాల పారాయణ మాధ్యమంగా మరియు అనుక్షణం బాబా తనను కంటికి రెప్పలా కాపాడుతున్న తీరు అనుభవంలోకి వచ్చిన వైనం వంటి ఇత్యాది అనుభవాల ద్వారా దాసగణులో ఆ శ్రద్ధాసబూరీలు పరిపూర్ణంగా దృఢమయ్యేటట్లు చేసి అంటే వాటిని స్వీకరించి, తరువాత ఉద్యోగాన్ని మానిపించారు. అంటే వామన శాస్త్రిగారు చెప్పిన సమయం ఆసన్నం కాగానే అసలు గురుదక్షిణను స్వీకరించారు.

ఇకపోతే, ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయం గురించి వివేచన చేయడం ఎంతయినా ముదావహం. అదేమిటో చూద్దాం! **“చెవిలో మంత్రోపదేశం చేయడం మా సాంప్రదాయం కాదు”** అని శ్రీ సాయి నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పారు. శ్రీ సాయి దేహధారియై నడయాడినంత కాలం, ఎప్పుడూ ఏ భక్తునికి కూడా మంత్రోపదేశం చేయలేదు. మరటువంటి నేపథ్యంలో దాసగణుకు మంత్రోపదేశం చేసిన శ్రీ వామనశాస్త్రి శ్రీ సాయి కార్యాచరణలో పాత్రధారి ఎలా అవుతారు? అని సందిగ్ధతకు లోనయ్యే అవకాశాన్ని మనం ఆస్కారమే లేదంటూ త్రోసిపుచ్చలేం! అలాంటి సందిగ్ధత కలగడం సముచితమే కానీ అనుచితం మాత్రం కాదు. సందిగ్ధపు తెరలను తొలగించి, సహేతుకమైన వాస్తవాలను స్పష్టంగా అవగాహన చేసుకునే

ప్రయత్నంలో దాసగణుకి జరిగిన మంత్రోపదేశ సందర్భాన్ని ఒకసారి పునరావలోకనం చేసుకుందాం!

బాబాతో భక్తులకున్నది జన్మాంతర బంధం. ఆ విషయాన్ని బాబా ఎన్నో సందర్భాలలో తమదైన శైలిలో విస్పష్టంగా విశదీకరించారు. అంతేకాదు, **"ఆ బంధం నాకు గుర్తుంది. మీకు గుర్తులేదు"** అని అంటూ మరుపులో నుండే భక్తుల వాస్తవిక మనఃస్థితిని తెలియజేసారు. కానీ, తమ భక్తుని పారమార్థిక ప్రగతి కోసమై ప్రతిక్షణం పరితపించే సద్గురువు. ప్రతి జన్మలో కూడా వివిధ మిషల ద్వారా భక్తుని ప్రేరేపించి పారమార్థిక పథోన్ముఖుని గావిస్తారు. ఆ విధంగా దాసగణుని ప్రేరేపించి, పారమార్థిక పథ ప్రవాసిగా చేయడానికి శ్రీ సాయి ఎన్నుకున్న మిష శ్రీ వామనశాస్త్రి! శ్రీ వామనశాస్త్రి యొక్క అపూర్వమైన భక్తిప్రపత్తులు, ధ్యానంలో వెలువడే అలౌకిక తేజస్సు వంటివి దాసగణుని ప్రేరేపించి, తాను కూడా పారమార్థికోన్నతి పొందాలనుకునేటట్లు చేసాయి. జన్మజన్మల నుండి తన నియోజిత సద్గురువు వెంట ఉండి నడిపిస్తున్నారనే సత్యం సహజంగానే ఎరుకలో లేకపోవడం వలన, బ్రాహ్మణవంశంలో జన్మించిన తనకు తెలిసిన పరిజ్ఞానం మేరకు, పారమార్థిక ప్రవాసం చేయాలంటే "గురువు నుండి మంత్రోపదేశం పొందాలి" అనే భావంతో "మంత్రోపదేశం చేయమని" శ్రీ వామనశాస్త్రిని అభ్యర్థించాడు.

అడిగిందే తడవుగా వామనశాస్త్రిగారు "గణపతిరావు, పారమార్థిక ప్రవాసంలో మంత్రోపదేశం పొందాల్సిందే" అని చెప్పి, దాసగణు చెవిలో ఏదో ఒక మంత్రాన్ని ఊది, దాసగణు గురుదక్షిణగా సమర్పించాలనుకున్న నెల జీతాన్ని జేబులో వేసుకునే ఆషామాషీ తంతు అక్కడ జరగలేదు. "నీకు వాటి ఆవశ్యకత లేదు" అనే ఉద్దేశ్యంతో వామనశాస్త్రిగారు ఒక పట్టాన మంత్రోపదేశం చేయడానికి అంగీకరించలేదు. తనకు తెలిసిన పరిజ్ఞానం మేరకు తంతు జరగకపోతే ప్రయోజనం ఉండదు అనే సగటు భక్తుని





ఆలోచనా సరళిని అనుసరించి, మంత్రోపదేశం పొందకపోతే తాను పారమార్థికంగా పురోగమించలేననే తన సొంత అభిప్రాయం మేరకు దాసగణు శ్రీ వామనశాస్త్రి పాదాలను గట్టిగా పట్టుకొని, "మంత్రోపదేశం చేయనిదే మీ చరణాలను వదలను" అని పెద్దపెట్టున రోదిస్తూ భీష్మించుకొని కూర్చొన్నాడు. అంతేకాదు, తనకు ఇంకేదో మంత్రోపదేశం ఉపదేశిస్తే కుదరదని, తాను శివభక్తుడు కనుక శివ మంత్రాన్నే ఉపదేశించాలని-తానే స్వయంగా నిర్దేశించుకొని-మొండిపట్టుపట్టాడు. అటువంటి పరిస్థితుల్లో, దాసగణుని భక్తి మార్గోన్ముఖుడను చేసే ప్రక్రియ కోసమై సాయి సంకల్పానుసారం నియమితుడైన వామనశాస్త్రి, ఆ కార్యసిద్ధి కోసం-బడికి వెళ్తాంటే పిల్లవానికి తాయిలం ఇచ్చిన చందంగా-దాసగణు కోరుకున్నట్లుగానే చేసారు. దాసగణు అభీష్టం మేరకు తనకు శివమంత్రాన్ని ఉపదేశించినా, హరి అవతారంగా భావించే పాండురంగ విట్టల దర్శనానికి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వెళ్ళమని ఆదేశించారు. చేసిన మంత్రోపదేశం, ఆదేశించిన నియమంలోని వైరుధ్యతను బట్టే మంత్రోపదేశం అనే ప్రక్రియకు శ్రీ వామనశాస్త్రి ఇచ్చిన ప్రాముఖ్యత మనకు స్పష్టంగా అవగతమవుతుంది. ఇంకా చెప్పాలంటే శివ మంత్రాన్ని గురూపదేశంగా పొందిన దాసగణు తరువాతి కాలంలో హరినామ సంకీర్తన చేసే హరిభక్త పరాయణునిగా ప్రసిద్ధుడయ్యాడు.

"మహారాజ్ ఇక నాకు దిక్కెవరు" అని దాసగణు వాపోయిన సందర్భంలో కూడా, శ్రీ వామనశాస్త్రి "శ్రీ సాయి చరణాలను అనన్యంగా ఆశ్రయించు. ఆయనే నీకు తరువాతి మార్గదర్శనం చేస్తారు" అని విస్పష్టంగా చెప్పారే కానీ, "నేను నీకు ఉపదేశించిన మంత్రాన్నే జాగ్రత్తగా పఠించు. ఆ సాధనే నీకు దారి చూపుతుంది" అని చెప్పలేదు. అంటే, శ్రీ సాయిచరణాలను అనన్యంగ ఆశ్రయించాక, ఇక ఈ తంతుతో పనిలేదు అని చెప్పకనే చెప్పారు.

**(సశేషం)**



# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము
## భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

## 10. సంస్కార కార్యంబు సాధు-సంతు

కం. దుర్మార్గులు పెరిగిన యెడ
ధర్మ క్షీణత గలుగును ధరణికి బరువౌ
మర్మం బవతారంబుల
ధర్మము నిలబెట్టి ధరణిన దుష్ట దండనజేయన్ 1

కం. ధనమును పుత్రులు కాంతలు
యను ఈషణముల జనులకు నజ్ఞత పెరుగన్
చని వానిని సరిచేయగ
పనిగట్టుక సాధువులిట బరగును ప్రేమన్ 2

ఆ.వె. అర్థ కామములను యాశించి జనములు
ధర్మ మోక్షములకు దారి గనక
ఈషణముల దగిలి ఈశుని మరువంగ
సాధు సంతు జన్మ సంభవించు 3

ఆ.వె. జనుల సంస్కరించి జాతిని దరిజేర్చ
భరత ఖండమందు భాతినింప
సంతజనుల జన్మ సంభవించుచు నుండు
అపుడు యిపుడు యనక యెప్పుడున్ను 4

సీ. కృతయుగ ద్వాపర, త్రేతములందున
సంహార కార్యంబు చక్కదిద్ది
ధరణిని కాపాడి ధర్మము నిలబెట్టి
అవతార కార్యంబు నవని నడపె





కలియుగమందున కర్కోటకులు హెచ్చి
కారుణ్య రహితులై కష్టబెట్ట
సహియించ భారమై సన్మార్గ కష్టాలు
సజ్జన సంఖ్యయు సన్నగిల్లె.

ఆ.వె. సజ్జనులను గాచి-సంస్కార కార్యాన
దుర్జనులను దీర్చి సజ్జనులుగ
కులమతముల రూపు కూల్చుకొఱకు సాయి
వచ్చి చేరె శిరిడి వాసమవగ 5

ఆ.వె. భవము దాటజేయు భక్తినావ యతడు
సాధు సంతులందు సద్గురుండు
వేద సార మతడు విజ్ఞాన ఖనిసాయి
విఠల రూపు డతడు వేరుగాదు. 6

కం. పురుషార్థములను బొందగ
పురజనులకు దారిజూపి పుణ్యుల జేసెన్
వరదుడు తానై శిరిడిన
అరమరికలు లేక సాయి నార్తుల బ్రోసెన్ 7

ఆ.వె. దాస గణుకు జూపె దాక్షిణ్యభావాన
గంగ యమున నీళ్ళు కాళ్ల నుండి
పయన మాపి సాయి ప్రయాగ తీర్థాన
పావనునిగ జేసె భక్తిపెరుగ. 8

ఆ.వె. ఆత్మ లోన తాను అన్ని వేళల యందు
మునిగియుండు సాయి ముక్తుడగుట
లోక విషయములకు లోనుగాకుండగా
అన్ని పనులు తానె అమరజేయు. 9

తే.గీ. సాఠెవాడయు, దీక్షితు, బూటివాడ
వెలసె శిరిడీన భక్తులు విశ్రమించ
అన్ని మతముల వారును నచట జేర
సాయి ఆరతి మొదలయ్యె చావడీన. 10

**(సశేషం)**

# బాబాతో మా అనుభవాలు

## – సాయివ్యాసులు శ్రీ బి.వి. నరసింహస్వామిగారు

1927లో నా గ్రహగతులు అనుకూలంగా లేక నా ఆరోగ్యం దెబ్బతిన్నది. నేను (పూనా నుండి 40 మైళ్ళ దూరంలో) జున్నర్ నుండి 2 మైళ్ళ దూరంలో నున్న సీతారామ ఉత్తరీశ్వర్‌ని ప్రతి ఆదివారం వెళ్ళి పూజ చేసేవాణ్ణి. ఒక ఆదివారం రాత్రి 9 గం.లకు సాయిబాబాకు ప్రణామం అంటూ శివునిపై పూలుపెట్టాను. వెంటనే నాకొక కాంతి, ఆ కాంతిలో నేనెప్పడూ స్మరించు కొనే బాబా రూపం కనిపించాయి. అప్పటినుండి నా ఆరోగ్యం బాగుపడి, నా జీవశక్తులన్నీ పుంజుకున్నాయి. జానకీదాసు అని ఒక సాధువు అక్క డుండేవారు. ప్రతి ఆదివారం సాయిని స్మరిస్తూ ఆయనకు నమస్కరించే వాణ్ణి. ఆయన అప్పడు "నీవు ఆశ్రయించిన సాధువు గొప్పవాడు. నాలాంటి పేదవాడి దగ్గరకు వస్తావెందుకు? నాబోటి వారెందరమో సాయిబాబా పాదాలు పట్టుకుంటాం" అన్నారు. నేను నా విడిదికి వెళ్ళి నిద్రపోయాను. అప్పడు బాబా ఫకీరుగా స్వప్నదర్శనం ఇచ్చి, "నీవు చాలా ఆతృతతో ఉన్నావు. నీ తనువు, మనస్సు పూర్తిగా నాకు భిక్షగా ఇచ్చివేయి. నీ కోరిక నెరవేరుతుంది" అన్నారు. "నీకీ భిక్ష ఇచ్చి మా నాన్నకి చెప్తాను" అన్నాను నేను. బాబా "నీ తండ్రిని సంప్రదించకుండా ఎలా చేస్తావులే?" అన్నారు. అందుకు నేను "నా జీవితానికి నేనే యజమానిని. నా తండ్రికి ఇంకా కొడుకులున్నారు. ఆయనకు పిల్లల్ని ఇచ్చింది నువ్వే. కనుక నన్ను నీకిచ్చు కోవడంలో ఏమీ అభ్యంతరం లేదు.

ఆయన నన్ను హృదయానికి దగ్గరగా తీసుకోవడం వలన నేనెంతో బ్రహ్మానందం అనుభవించాను. నేను నిద్రలేచేసరికి నా మనస్సెంతో ఆనందంగా ఉదాసీనత, వైరాగ్యాలతో నిండి కన్పించింది. లౌకిక విష యాలు మునుపటిలా నన్నాకర్షించలేకపోతున్నాయి. 2, 3 నెలల తర్వాత 1928 ఒక ఫాల్గుణంలో పుండరీపురంలో నాకొక కొడుకు పుట్టాడు. అటుపై





15 నెలల తర్వాత నేనూ, మా నాన్నా శిరిడీ వెళ్ళినపుడు నాకు ఇంకో కొడుకు కలగాలని నాన్న బాబాను ప్రార్థించాడు. అలా 1931లో కలిగిన బిడ్డకు సాయిదాసు అని పేరు పెట్టుకున్నాము. పుట్టిన రెండోరోజున విపరీతమైన జ్వరం వచ్చింది వాడికి. బాబా ఊదీ, తీర్థం, బాబా శేషవస్త్రంతో తయారైన తాయెత్తు-వీటితోనే ఈ జ్వరం తగ్గింది. వాడికి ఏడాది నిండగానే శిరిడీ తీసుకువెళ్ళాము. అక్కడ సమాధికి అభిషేకం, వస్త్రదానం, బ్రాహ్మణులకు సంతర్పణ ఏర్పాటు చేసాము. 1931లో నేను గాజుల వ్యాపారం ప్రారంభించినపుడు అది బాబా పేరిటనే ఉండాలని అనుకొని బాబా ముందు చీటీలు వేసాను. "శ్రీ సమర్థ సాయినాథ్ అండ్ కో" అనే పేరు వచ్చింది. అదే పెట్టాను. ఆ కంపెనీ దైవ భీతి, న్యాయప్రవర్తన అనే వాటినే తనకు మార్గదర్శక సూత్రాలుగా ఉంచుకొని నడిచింది. నేను బాబా పేరిట యిచ్చిన ఊదీ, తీర్థం అవి గ్రహించిన వారి వ్యాధులు పోగొట్టి వారికి మేలు చేసేవి.

1932 సెప్టెంబరు ఒకటవ తేదీన 'మక్కా' యాత్ర చేస్తూ కలరా బారిన పడ్డాను. చావు తప్పదనిపించింది. మా నాన్న నా ఆఖరి కోరికలేమిటో అడిగారు. "నేను చచ్చిపోతే నా శవం శిరిడీకి తీసుకువెళ్ళండి. సాయి బాబాయే నా కృష్ణుడు. నన్ను ఆయన దగ్గరే దహనం చేయండి" అన్నాను. బాబా ఫొటో, వెలిగే అగరవత్తులు నా తల దగ్గర ఉంచారు. మాటిమాటికీ విభూతి, తీర్థమూ ఉపయోగిస్తున్నాను. పరిస్థితి అలాగే కొనసాగుతోంది. ఆ రోజు-అర్ధరాత్రి మా వదిన సుభద్రా బాయికి ఉనావా (గుజరాత్‌లో సిదాపూర్ దగ్గర)లో ఉండే మిరాదాతార్ అనే ముస్లిం వలీ ఆవహించాడు. ఆమె ద్వారా ఆయన యిలా పలికాడు. నీవు సాయిని పిలుస్తున్నావు. ఆయన వృద్ధుడై పోయి కదలటం కష్టంగా ఉంది. ఆయన నాకు బాబాయి అవుతారు. ఆయన పంపితే నేను వచ్చాను. భయపడకు-బాబా ఆశీస్సు మీకుంది. ఆయన దర్శనం రేపు కలుగుతుంది. ఒక కప్పు కాఫీ చేసి యివ్వండి రోగికి'. నేను కాఫీలో బాబా ఊదీ వేసుకొని తాగాను. దానితో నా జబ్బు పోయింది. విరేచనాలు హఠాత్తుగా ఆగిపోయాయి. మరునాడు

డాక్టరు నన్ను పరీక్షించి చాలా ఆశ్చర్యంతో "నిన్న యీ మనిషి మరణపు అంచున ఉన్నాడు. ఇంత తొందరగా బాగై యిక్కడ దాకా ఎలా వచ్చాడు" అన్నారు. "సాయిబాబా వైద్యులకు వైద్యుడు. ఆయన పవిత్ర విభూతే నన్ను కాపాడింది" అని చెప్పాను.

నేను ఏడేళ్ళ వయసులో ఉన్నప్పుడు-ఒకసారి శిరిడీలో బాబా పాదాలు ఒత్తుతున్నాను. చుట్టూ ఉన్న పిల్లలకు బాబా మిఠాయిలు పంచసాగారు. సహజంగానే నా దృష్టి మిఠాయి మీదికి వెళ్ళి, కాళ్ళు నొక్కడం నీరసించింది. ప్రక్కనే ఉన్న మా అమ్మ మిఠాయి మీద చూపు పెట్టి బాబా సేవ అశ్రద్ధ చేస్తావా?" అని ఒక్కటి వేసింది. బాబా "ముసలిదానా! ఎందుకు పిల్లవాడిని కొడతావ్!" అని కోప్పడ్డారు. మా అమ్మ వీడికి మీ సేవ చేసుకోవాలనే సద్బుద్ధి నివ్వండి" అని వేడుకున్నది. దానికి బాబా "ఇతడు నన్ను చక్కగా సేవిస్తాడు. భగవంతుడితడికి స్వచ్ఛమైన కోరికలే యిస్తాడు. భయపడకు వాడిని కొట్టకు" అన్నారు.

పన్నెండేళ్ళ వయస్సులో మా పెద్ద బావతో కలిసి షిరిడీ వెళ్ళాను. మా దగ్గర వంద రూపాయలున్నాయి. బాబా పదీ, పాతికా అలా దక్షిణ అడుగుతూ వచ్చారు. చివరికి పాతిక రూపాయలు మిగిలాయి. వెంటనే మా తిరుగు ప్రయాణానికి, బాబా దక్షిణకు డబ్బు పంపమని అహ్మద్‌నగర్‌కు వ్రాసాము. ఆ సాయంత్రం బాబా పాతిక రూపాయల దక్షిణ అడిగారు. మా బావ మా దగ్గరున్న డబ్బంతా అయిపోయింది. తిరుగు ప్రయాణానికే లేవు" అన్నాడు. వెంటనే బాబా చెత్త మాట్లాడకు. నీ జేబులో ఇరవై ఐదు రూపాయలున్నాయి. నీవు వ్రాసిన ఉత్తరానికి మనియార్డరు రేపు వస్తుంది. భయపడకు" అన్నారు. మా బావ ఇరవై ఐదు రూపాయలూ ఆయనకు సమర్పించుకున్నాడు.

బాబా యిలా అంటుండేవారు. "నాకు ఒకటిచ్చిన వారికి రెండు, రెండిచ్చిన వారికి ఐదు, ఐదిచ్చిన వారికి పదీ ఇస్తాను". దీని వెనుక నిగూఢమైన అర్థమేమిటంటే-బాబా భగవంతుడు ఆయనకు మనం యిచ్చిన దానికి కొన్నిరెట్లు ఎక్కువ తిరిగి లభిస్తుంది.





# మాతృసంస్థ కబుర్లు

ఏప్రిల్ 15వ తేదీ సాయిధామం సేవాశ్రమ పరిసర గ్రామమైన "అంకిరెడ్డిపల్లి" గ్రామంలో సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు, హనుమంతుని శోభాయాత్రను ప్రారంభించి హనుమత్ తత్వాన్ని, భక్తినీ, ధైర్యస్థైర్యాలు మొదలైన విషయాలు గ్రామ ప్రజలకు వివరించారు.

ఏప్రిల్ 25వ తేదీ సాయిధామం సేవాశ్రమ పరిసర గ్రామమైన నాగిశెట్టి పల్లెలో రామాలయం, మరకత శివలింగం, శివపంచాయతనం, నవగ్రహాలు, రామధ్వజం, శివధ్వజం, సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారి కరకమలములచే ప్రతిష్ఠా కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. భక్తులనుద్దేశించి స్వామివారు రామతత్వాన్ని, సనాతన సంప్రదాయాన్ని వివరించారు.

మే రెండోవారం రాబోతోంది అనగానే ఆశ్రమవాసులందరూ రేపల్లె సాయినాథ క్షేత్రం వెళ్లాలనీ, మేము వస్తామంటే మేమొస్తామని పోటీ పడతారు. ఈసారి కూడా ఆశ్రమం పిల్లలు, గురుదేవుల భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు అంతా కలిసి పదిహేను మంది 9వ తేదీ రాత్రి రైల్లో ప్రయాణమయ్యారు. అందరి హృదయాల్లో ఆనందం ఉరకలు వేస్తుంది. చక్కగా కృష్ణా నదిలో ఆడుకోవచ్చు, మోపిదేవి, మోర్తోట, శ్రీకాకుళం అన్నీ దేవాలయాలు చూడొచ్చు అని. కొంచెం భయం అమ్మో అక్కడ ఎండలు భరించగలమా అని .... అయినా అందరూ సిద్ధమై తరలివెళ్ళారు. మే 10వ తేది ఉదయం 6 గంటలకు రేపల్లె రైలు దిగగానే నల్లని దట్టమైన మేఘాలు, చల్లని గాలి, సన్నని వానతుంపరులు ... అబ్బా ఎంత హాయిగా ఉందో అనుకున్నాం. అందరూ ఆటోలు ఎక్కి మైనేనివారిపాలెం చేరుకున్నాం. స్నానాదికాలు ముగించుకొని ఆశ్రమం అంతా వీక్షించి సాయినాధుల వారినీ, పరమపూజ్య గురుదేవుల మందిరాలను దర్శించుకున్నాం. అటు తర్వాత మోపిదేవి, శ్రీకాకుళం(ఆంధ్ర మహావిష్ణు దేవాలయం) దర్శించుకొని మధ్యాహ్నం 3 గం.లకు క్షేత్రానికి వచ్చాము.

సాయినాథ క్షేత్రం సాయినాధుని 16వ వార్షికోత్సవాలలో భాగంగా

మే 11, 12 తేదీలలో ఉత్సవాలు - 11వ తేది ఉదయం 6.30 ని.లకు శ్రీ సాయినాథుల వారికి క్షీర, జలాభిషేకాలు, కురుస్తున్న వానను లెక్క చేయకుండా భక్తులంతా అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 8.30ని.లకు అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమం జరిగాయి.

10 గం.లకు గ్రామస్తులు కొందరు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి దగ్గరకు వచ్చి యోగక్షేమాలు అడిగి, 12వ తేదీ జరుగవలసిన కార్యక్రమాల గురించి చింతిస్తున్నాము స్వామీ అన్నారు. మూడు రోజులపాటు తుఫాను ఉంది స్వామి కలెక్టర్‌గారు రేపల్లెలో క్యాంపు వేసారు. ప్రజలందరినీ అప్రమత్తంగా ఉండమని ఆదేశాలు జారీ చేసారు. సముద్రమంతా అల్లకల్లోలంగా ఉందంట స్వామీజీ. అందరూ భయపడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావొద్దని చెబుతున్నారు. విపరీతమైన గాలి వల్ల చెట్లు విరిగిపడొచ్చు. మరేదైనా అనర్థం జరగవచ్చు అని చెబుతున్నారని చెప్పకొచ్చారు.

స్వామీజీ ఐదు నిముషాలు కళ్లు మూసుకొని ధ్యానమగ్నులై ఏం ఫర్వా లేదు. సాయినాధుని ఆశీస్సులతో మన కార్యక్రమానికి ఏ అడ్డంకులు రావు. అన్ని ఏర్పాట్లు చేద్దాం. కార్యక్రమానికి ఐదుగురు వచ్చినా, 500 మంది వచ్చినా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని గురుదేవుల అనగానే అందరిలో కొండంత ధైర్యం వచ్చింది.

11 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణ పూర్తి కాగానే వర్షంలోనే 12వ తేదీ ఏర్పాట్లు ప్రారంభమైనాయి. టెంట్లు, వంట సామాగ్రి, మంచి నీళ్ల ఏర్పాట్లు, సరుకులు తీసుకురావడం, కూరగాయలు తేవడం, పూలు మాలలు కట్టడం అన్ని ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయి. సాయంత్రానికి తెనాలి నుండి గోపీకృష్ణగారి కుటుంబం, సత్తెనపల్లి ఆశ్రమ నిర్వాహకులు అయిన శ్రీ ప్రేమ్‌కుమార్‌గారు విచ్చేసారు. సాయినాథుల వారికి పుష్పాలంకరణ ఎంతో చక్కగా ప్రేమ్‌కుమార్‌గారు చేశారు. 11వ తేదీ రాత్రికి వాన శాంతించింది. గాలి మాత్రమే వీస్తుంది.

12వ తేదీ ఉదయం 6 గంటలకల్లా ఆకాశమంతా నిర్మలంగా ఉంది. సూర్యభగవానుడు మెల్లిమెల్లిగా వస్తున్నాడు. వాన లేదు, ఏమీ లేదు అందరిలో ఆశ్చర్యం, గురువుగారు చెప్పినట్టే జరిగిందని ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారందరూ. సాధు సత్పురుషుల మాటలకు





అంత శక్తి ఉంటుందన్నమాట.

12.05.2022 ఉదయం కాకడ హారతి అనంతరం గం.6.30లకు శ్రీ సాయినాథుల వారికి క్షీర, ఫల, జలాభిషేకాల కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొని సాయినాథుని ఆశీస్సులు పొందారు. అనంతరం సాయినాథుల వారికి ప్రత్యేక అలంకరణ, ప్రథమ పూజా కార్యక్రమం జరిగాయి.

10 గం.లకు సాయికి సహస్ర నామార్చన, దేవాలయం నిండా భక్తులు పూజకు ఆశీనులై ఉన్నారు. పూజా కార్యక్రమం ప్రారంభమైనది. బిల్వ, తులసీ దళాలు, పుష్పాలతో సామూహిక పూజా కార్యక్రమం స్వామీజీ సహస్ర నామాలు చదువుతూ ఉండగా, సాయి రమణ, ప్రేమ్‌కుమార్‌గార్లు ప్రధాన పీఠం దగ్గర పూజ చేయగా, భక్తులంతా క్రింద కూర్చొని ఓంకారం ధ్వనిస్తూ పూజ చేయసాగారు. ఎండాకాలంలో వచ్చే మల్లెపూలతోనే ఎందుకు చేయాలి, కొబ్బరికాయ ఎందుకు కొట్టాలి, పూజ యొక్క పరమార్థం ఏమిటో స్వామీజీ సవివరంగా వివరించారు. గం.12.30 ని.లకు మహా హారతి అనంతరం అన్నదాన కార్యక్రమం మొదలైంది. దాదాపు 1500 మంది భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ 16వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆర్థికంగా, హార్థికంగా సహాయసహకారాలు అందించిన వారందరికీ శ్రీ సాయినాథుల వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ రక్షాహస్తంగా ఉండాలనీ సాయివాణి మనసారా ఆశీర్వదిస్తున్నది.

మైనేనివారి పాలెం వాస్తవ్యులైన సుబ్రహ్మణ్యం, జయలక్ష్మి గార్లు నూతనంగా నిర్మించుకుంటున్న గృహాన్ని వీక్షించవలసిందిగా పూజ్య స్వామీజీని వారు కోరగా, గృహ సందర్శన చేసి కొన్ని సలహాలను సూచించారు స్వామీజీ. స్వామీజీని గృహ ప్రవేశానికి ముహూర్తం, గృహానికి పేరు పెట్టవలసిందిగా వారు కోరారు. గృహప్రవేశానికి తప్పక రావలసిందిగా కుటుంబమంతా ఆహ్వానించారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు ట్రస్టు సభ్యుడైన శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణ, మాధురిగార్ల గృహంలో సత్సంగ కార్యక్రమం, గురు పాదుకా పూజా కార్యక్రమం ఉన్నందున సాయంత్రానికి స్వామీజీ తెనాలి తరలి వెళ్ళారు. ఎంతో భక్తి శ్రద్ధలతో వారి అపార్టుమెంటులోని వారంతా 13వ తేదీ సాయంత్రం పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామీజీ వారి ప్రవచనం విని ఆశీస్సులు పొందారు.